batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

30 ఆగస్టు 2026
ఆదివారం

తాజా వార్తల సద్దిమూట

## ఎమ్మెల్సీని బహిష్కరించిన మజ్లిస్

మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలపై చర్యలు

పదవికి రాజీనామా చేయాలని ఆదేశం



హైదరాబాద్, బతుకమ్మ:హైదరాబాద్ మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ను తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మజ్లిస్ నేత ఓవైసీ ఆదేశాలు జారీ చేశారు. ఆయనను పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేశారు.

02



## నాకొక న్యాయం.. సుభాష్ చంద్రకు ఒక న్యాయమా..?

విజయ్ మాల్యా సంచలన ట్వీట్

మీడియా ప్రశ్నించదా?

02

హైదరాబాద్, బతుకమ్మ:జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రకు వ్యక్తిగత దివాలా కేసులో భారీ ఊరట లభించింది. బ్యాంకులకు, రుణ సంస్థలకు ఆయన చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ.22,006.57 కోట్లు క్లెయిమ్‌గా ఉంది. అయితే, కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే రీపేమెంట్ ప్లాన్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (చీజూ) ఆమోదం తెలిపింది. ఎన్సీఎల్టీ ఆమోదించిన ఈ ప్లాన్ కారణంగా రుణదాతలు దాదాపు 99.97 శాతం నష్టపోవాల్సి వస్తుంది. అంటే రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లపై కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే రికవరీ అవుతాయి. రికవరీ రేటు సుమారు 0.03 శాతంగా ఉంటుంది. సుభాష్ చంద్ర ప్రతిపాదించిన రీపేమెంట్ ప్లాన్ కు 2024 నవంబర్ నెలలో జరిగిన రుణదాతల ఓటింగ్ లో 80.814 శాతం ఓటింగ్ షేర్ మద్దతు లభించింది. అయితే, ఈ ప్రతిపాదనను ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఆర్బీఎల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితర సంస్థలు వ్యతిరేకించాయి.

# పీఆర్‌టీయూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

నిజామాబాద్, బతుకమ్మ : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్రంలో పేరు మోసిన ఉపాధ్యాయ సంఘం. అత్యధికంగా ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్న యూనియన్. అలాంటి యూనియన్ కు జిల్లా వారీగా కార్యవర్గాల ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. గురుతరమైన గురువులుగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య అధికారులను సమన్వయం చేసేందుకు ఏర్పడిన సంఘం ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నయి. రెండేళ్ళకోసారి జరిగే ఎన్నికల్లో గెలుపు కోసం బరిలో నిలిచిన వారు డబ్బులను నీళ్ళ ప్రాయంలా ఖర్చు చేస్తున్నారు. 2026-28 సంవత్సరానికి గాను నిజామాబాద్ జిల్లా పీఆర్ టీయూ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. జిల్లాలోనీ అన్నీ మండలాలకు కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. అన్నీ మండలాల కమిటీకి మాత్రమే ఓటు హక్కులు ఉండగా జిల్లాలో 366 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సుక్కముక్కలతో విందులు

02

భారీగా ఖర్చు చేస్తున్న లీడర్లు

ఆదివారం జరిగే ఎన్నికల కోసం జోరుగా సిట్టింగ్ లు, దావత్ లు ఊపందుకున్నాయి.వారం రోజుల ముందుగానే మండల కమిటీల ఎన్నికలు పూర్తి కాగానే ప్రచారం జోరందుకుంది. ఈసారి ఎన్నికల్లో పదవులు ఏకగ్రీవమయ్యే అవకాశం లేకపోవడంతో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడడం లేదు. గతంలో పని చేసిన వారు కొత్త వారు కూడా పోటీ పడుతుండడంతో పోటీ రసవత్తరంగా మారింది. టీచర్ ఎమ్మెల్సీ, రాష్ట్ర కమిటీ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోకుండా బరిలో నిలిచిన వారు డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. రానున్న రెండేళ్ళ తర్వాత సాధారణ ఎన్నికలు ఉండగా అప్పటికే కొందరు తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు రాష్ట్ర కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తామనుకునే ఆశవాహులు బరిలో నిలిచి ఎన్నికలను పోటాపోటీగా మలిచారు. కార్యవర్గంలో కీలకమైన పదవులకే డిమాండ్ ఉండగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్ల ప్రక్రియ, విత్ డ్రా, ఎన్నికలు, కౌంటింగ్ ఉండడంతో పీఆర్ టీయూ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రధానంగా ఉపాధ్యాయ సంఘంలో మేజర్ యూనియన్ అయిన పీఆర్ టీయూ జిల్లా కమిటీ ఎన్నికలను అభ్యర్థులు ఆశామాషీగా తీసుకోవడం లేదు. సీనియర్లు వర్సెస్ జూనియర్లుగా సీపీఎస్ వర్సెస్ ఓపీఎస్ గా ఎన్నికలు జరుగుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రధానంగా కొన్ని సంవత్సరాలుగా పదవుల్లో ఉన్న వారి శైలీని గతంలో జరిగిన తప్పులను ఎత్తిచూపుతూ ప్రచారం చేస్తుండగా తమకు ఉన్న అనుభవంతోనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడం, అధికారులను సమన్వయం చేస్తామని సీనియర్లు చెబుతున్నారు.




## చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించండి

సీఎం రేవంత్ రెడ్డికి సిఫారసు చేసిన వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్



02

హైదరాబాద్, బతుకమ్మ:చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలి. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ ( ఎఫ్ టిఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్సూచించింది. రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కలిసి నివేదిక అందించింది.

నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. తెలంగాణ వ్యవసాయ - రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, ఎం. భవానీరెడ్డి లు ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదిక అందించారు. కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది.

అభ్యంతరాలు.. ఫిర్యాదుల గడువును


## మరో నాలుగు వారాలు పొడిగించండి


ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయి

45.19 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరం

చీఫ్ ఎలక్షన్ కమీషనర్‌కు లేఖరాసిని సీఎం రేవంత్ రెడ్డి

02






## రస బాసగా కామారెడ్డి బల్దియా సమావేశం



- సమాచారం లేకుండా వార్డుల్లో పనులపై బిఆర్ఎస్ అందోళన
- ఆక్రమ నిర్మాణాలకు కాంగ్రెస్ దన్నుపై బిజేపి నిరసన
- సీఎంకు వ్యతిరేక వాఖ్యలపై కాంగ్రెస్ గరగరం

02

కామారెడ్డి, బతుకమ్మ: కామారెడ్డిలో పోత్తులతో ఎర్పడిన బల్ధియాలో అప్పుడే బీటలు వారుతున్నాయి. శనివారం జరిగిన కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రస బాసగా జరిగింది.



# రస బాసగా కామారెడ్డి బల్దియా సమావేశం

మిత్ర పక్షంగా కౌన్సిల్ ఎర్పాటుకు ( పాలకపక్షం కు) సహకరించిన బిఆర్ఎస్ తమను అధికార కాంగ్రెస్ పార్టీ మిత్రబేధం పాటిస్తుందని మండిపడింది. తమకు సమాచారం లేకుండానే అధికారులు పనులు చేయడం ఎమిటని బిఆర్ఎస్ కౌన్సిలర్ లు మండిపడ్డారు. ఉదయం బల్దియా సమావేశం చైర్పర్సన్ ఉమారాణి అధ్యక్షతను ప్రారంభం కాగానే బిఆర్ఎస్ కౌన్సిలర్ లు పోడియం వద్ద నిరసనకు దిగారు. మున్సిపల్ అధికారులు కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా డివిజన్ లలో పనులు చేస్తుంటే తాము ఎందుకు తమకు పధవులు ఎందుకు అని మండిపడ్డారు. బల్దియా అధికారులు తీరు మార్చుకోకపోతే కౌన్సిలర్ పధవులకు రాజీనామా చేస్తామని హెచ్చారించారు. కామారెడ్డి బల్దియాలో అక్రమ నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ లు సహకరిస్తున్నారని బీజేపి కౌన్సిలర్ లు మండిపడ్డారు. కామారెడ్డిలో పాలకులకన్న షాడోల పెత్తనం కోనసాగుతుందని దానిని సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి మున్సిపాల్టిలో పాలకవర్గంను కీలు బోమ్మలుగా చేసి అడిస్తున్నారని, కౌన్సిలర్ లకు సమాచారం లేకుండా ఎజెండాతో పాటు నిర్ణయాలు చేస్తున్నరని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి డోన్ డౌన్ అంటు నినాధాలు చేశారు. దానితో కాంగ్రెస్ కౌన్సిలర్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం రసబాసగా మారడంతో పోలిసులు రంగ ప్రవేశం చేశారు. పట్టణ సిఐ నరహరి అధ్వర్యంలో కౌన్సిల్ హల్ లో కౌన్సిలర్ లను సముధాయించి గోడవలను, ఆందోళనను సధ్దుమణిగించారు. ఈ సంధర్బంగా ఎజెండాకు పాలకవర్గం అమోధం తెలిపింది, పాలకవర్గం ఎర్పాటు తరువాత జరుగుతున్న మూడో సమావేశం రసభాస కావడంతో భవిష్యత్తు సమావేశాలు ఎలా ఉంటుంది కామారెడ్డి డేవలప్ మెంట్ కు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు అనేది పాలకవర్గం ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తుందనే చర్చ జరుగుతుంది.

# చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించండి

చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు

# పీఆర్ టీయూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఉపాధ్యాయ సంఘంలో మెజార్టీ ఉపాధ్యాయులు ఉన్న యూనియన్ అయినా పీఆర్ టీయూ ఎన్నికల్లో సుక్కముక్కలతో విందులు జోరందుకున్నాయి.

మండల కమిటీలోని బాధ్యులకు ఎక్కడికక్కడ విందులు ఏర్పాటు చేసి దావత్ లు ఇస్తున్నట్లు తెలిసింది. మహిళ ఓటర్లకు కానుకలను ఇచ్చారనే టాక్ నడుస్తోంది. రెండుసంవత్స రాల పదవి కాలం కోసం జరుగుతున్న ఖర్చును కొందరు ఎత్తి చూపుతున్నారు.

ఎన్నికల్లో ఖర్చు చేసే వారు పదవుల్లో వచ్చిన తర్వాత అంతకుమించి సంపాదిస్తారని ప్రచారం చేస్తున్నారు. బిజినెస్ టీచర్లు ఉపాధ్యాయ సంఘం ఎన్నికలను కాస్లీ ఎలక్షన్ గా మార్చారనే అపవాదు కూడా ఉంది. ప్రధానంగా ఉపాధ్యాయ సంఘాలలో మెజార్టీ సంఘమైన పీఆర్ టీయూ లోని ఎక్కువగా బిజినెస్ టీచర్లు ఉన్నారని వారే ఎమ్మార్సీలలో పని చేయడంతో పాటు కాంప్లెక్స్ బాధ్యులుగా ఉన్నారని వారి ద్వారానే మీ పనులు జరుగుతాయని బెదిరింపులు చేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆదివారం జరిగే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అనే ఉత్కంఠ ఉపాధ్యాయుల్లో పెరిగింది.

# ఎమ్మెల్సీని బహిష్కరించిన మజ్లీస్

ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి పార్టీ జాయింట్ సెక్రెటరి ఎస్ఏ. హుస్సెన్ అన్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో హల్చల్ అయింది. ఎమ్మెల్సీ బేగ్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నిస్తుండడం కొంతమంది యువకులు అతడిని పట్టుకుని కొట్టడం, ఇవన్నీ కూడా వీడియోలో ఉన్నాయి. దీంతో తనపై చర్య అనివార్యమని పోలీస్ కేసు పెట్టే అవకాశం ఉందని తెల్చుకున్న బేగ్ ముందుగానే పోలీసులను ఆశ్రయించాడు . తనపై డీప్ ఫేక్ వీడియోలు, ఏఐ వీడియోలు చేస్తున్నారని అందువల్ల చర్య తీసుకోవాలంటూ ముందు జాగ్రత్తగా పోలీసులకు పిర్యాదు చేశారు. అయితే ఈ సంఘటనపై నివేదిక తెప్పించుకున్న ఓవైసీ, విడియోల ఆదారంగా జరిగిన సంఘటన వాస్తవమేనని నిర్ధారించి ఆయనను నోటీసు, వివరణ కూడా అడగకుండానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ కూడా చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ లో తొలిసారి మజ్లీస్ పార్టీ తన ప్రజా ప్రతినిధిని రాజీనామా కోరినట్టయింది. అయితే ఈ వ్యవహారం పతంగి పార్టీకి తీవ్ర మచ్చని తెచ్చింది.

**ఎమ్మెల్సీ పై వేటుపై విమర్శలు...**

మైనర్ పై లైంగిక దాడి ఆరోపణలపై ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ పై వేటు వేయడాన్ని ప్రతిపక్షలు విమర్శలు చేశారు. ముందుగా ఎమ్మెల్సీని కాపాడేందుకు మజ్లీస్ పార్టీ ప్రయత్నించిందని బిజేపి ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. రహ్మత్ బేగ్ భూ కబ్జాల వ్యవహారంలో చాల ఆరోపణలు ఉన్న ఓవైసీ చర్యలు తీసుకోలేదని, లైంగిక దాడి విడియోలు బహిర్గతం కావడంతో అర్ధరాత్రి హడావిడిగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రైవేట్ విడియోలతో పార్టీ పరువు పోతుందని ఓవైసీ సోధరులు మీడియా ముందుకు రాకుండా పార్టీ జాయింట్ సెక్రెటరి చేత అది సోషల్ మీడియాలో పోస్టు చేశారని విమర్శలు చేశారు. ఎమ్మెల్సీ రహమత్ బేగ్ ను ఎందుకు బహిష్కరించారో ప్రజలకు ఓవైసి జవాబు చేప్పాలని బిఆర్ఎస్ నాయకుడు సల్మాన్ ఖాన్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీతో పాటు ఒక ఎమ్మెల్యే, ఒక కార్పోరేటర్ కుడా ఉన్నారని వారిపై దానికి సంబంధించిన ఆదారాలు ఉన్నాయని చర్యలు తీసుకుంటారా అని సవాల్ విసిరారు.

# అభ్యంతరాలు.. ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించండి

హైదరబాద్, బతుకమ్మ:తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ూాణణ) గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నంబర్ 172) ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# నాకొక న్యాయం.. సుభాష్ చంద్రకు ఒక న్యాయమా..?

వ్యతిరేకించిన రుణదాతల ఓటింగ్ వాటా మాత్రం 20శాతం కంటే తక్కువగా ఉంది.అయితే ఇక్కడ మరో విషయం ఏమిటంటే.. ప్లాన్ తిరస్కరించి సుభాష్ చంద్రను దివాలా ప్రక్రియలోకి నెట్టడం వల్ల రుణాతలకు మరింత తక్కువ మొత్తమే దక్కే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని ట్రిబ్యునల్ ప్రస్తావించింది. ఎందుకంటే.. సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువ. రీపేమెంట్ ప్లాన్‌లో ప్రతిపాదించిన మొత్తంతో పోలిస్తే ఆయన ఆస్తుల నుంచి వచ్చే రికవరీ పరిమితంగానే ఉంటుందని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది.

**నాకు మాత్రం అన్యాయం చేశారన్న విజయ్ మాల్యా ..**

సభాస్ చంద్ర రుణాల రీపేమెంట్ ప్లాన్ కు ఎన్సీఎల్టీ ఆమోదించినట్లు వచ్చిన వార్తలపై వ్యాపారవేత్త విజయ్ మాల్యా స్పందించారు. చాలా మంది రుణ గ్రహీతలు తక్కువ మొత్తాలు చెల్లించి తమ రుణాలను పరిష్కరించుకుంటున్నారని, తనకు మాత్రం అన్యాయం జరిగిందంటూ ట్వీట్ చేశారు.మాల్యా ట్వీట్ ప్రకారం.. “ఇది నిజమే అయితే.. నా స్నేహితుడు సుభాష్‌కు హృదయపూర్వక అభినందనలు. రూ.6,203 కోట్ల జడ్జిమెంట్ డెట్‌కు గాను బ్యాంకులు, ప్రభుత్వం నా నుంచి రూ.14,100 కోట్లు రికవరీ చేసినట్లు అంగీకరించాయి. కానీ, ఎంతోమంది రుణగ్రహీతలు అసలు బకాయిలో కొంత భాగానికే సెటిల్‌మెంట్ చేసుకున్నారు. ఇదే భారతీయ రుణ పరిష్కార న్యాయమని అనుకోవాలా? ఈ విషయంపై మీడియా నుంచి ఎలాంటి ప్రశ్నలు లేవు.” అంటూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

## శాకాహారులకు ప్రోటీన్లను అందించే అత్యుత్తమ ఆహారం ఇది..

# రోజూ తీసుకుంటే ఎంతో మేలు..

శాకాహారులు, వీగన్లు రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ పొందేందుకు ఎన్నో మొక్కల ఆధారిత ఆహారాలను ఎంచుకుంటారు. అయితే ప్రోటీన్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి పలు పోషకాలను ఒకేసారి అందించే చిన్న విత్తనం ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టిని ఆకర్షిస్తోంది. అదే హెంప్ హార్ట్స్. పొట్టు తొలగించిన హెంప్ విత్తనాలు తినడానికి సులభంగా ఉండటంతోపాటు, తక్కువ పరిమాణంలోనే పలు ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. హెంప్ హార్ట్స్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. సుమారు రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో 8.4 గ్రాముల వరకు మొక్కల ఆధారిత ప్రోటీన్ లభిస్తుంది. అలాగే శరీరానికి అవసరమైన మొత్తం తొమ్మిది ఎసెన్షియల్ అమైనో యాసిడ్లు ఇందులో ఉంటాయి. అందువల్ల వీటిని కంప్లీట్ ప్రోటీన్ అందించే ఆహార వనరుగా తీసుకోవచ్చు. ముఖ్యంగా శాకాహారులు, వీగన్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

**అమైనో యాసిడ్లు అధికం..**

హెంప్ హార్ట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ కూడా సహజంగా సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలు సడలించడంలో, రక్తప్రసరణ సక్రమంగా ఉండటంలో, సాధారణ రక్తపోటు నియంత్రణకు తోడ్పడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.వీటిలో ప్రోటీన్ మాత్రమే కాకుండా మెగ్నిషియం, ఒమెగా-3 వంటి పోషకాలు కూడా లభిస్తాయి. సుమారు 25 గ్రాములు లేదా రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో దాదాపు 175 మిల్లీగ్రాముల మెగ్నిషియం, 2.5 గ్రాముల ఏఎల్ఏ ఒమెగా-3 లభిస్తుంది. ఇందులో ఏఎల్ఏ, ఎల్ఏ, జీఎల్ఏ వంటి కొవ్వు ఆమ్లాలు ఉంటాయి.

హెంప్ హార్ట్స్‌లో ఒమెగా-6 నుంచి ఒమెగా-3 నిష్పత్తి సుమారు 2.5:1 నుంచి 3:1 వరకు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లోని పోషకాల కలయిక వాటిని చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలను అందించే ఆహారంగా మారుస్తుంది. ప్రోటీన్, మెగ్నిషియం, ఏఎల్ఏ, జీఎల్ఏ, అర్జినైన్ వంటి పోషకాలు ఇందులో ఉండటం వల్ల రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవచ్చు.

# బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్ ను సందర్శించిన కలెక్టర్





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బందీ గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్ కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి. చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

# నీట్ (పీజీ) పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నీట్(పీ.జీ) పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్. మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిశిత పరిశీలన జరిపారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడా కంపూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నీట్(పీ.జీ) పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్(పీ.జీ) పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, ఏ.సీ.పీ ప్రకాశ్, తహసిల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి అసభ్య పదజాలం పై ఎథిక్స్ కమిటీ చర్చించాలని చైర్మెన్‌ను కోరాం..

### కౌశిక్ రెడ్డికి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వాలి

### మాజీ మంత్రి ,ఎథిక్స్ అసెంబ్లీ కమిటీ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరబాద్, బతుకమ్మ:సీఎం రేవంత్ రెడ్డి అసభ్య పదజాలం పై ఎథిక్స్ కమిటీ చర్చించాలనీ చైర్మెన్ ను కోరినట్లు మాజీ మంత్రి ,ఎథిక్స్ అసెంబ్లీ కమిటీ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లి అవరణలో మీడియాతో చిట్ చాట్ లో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ...ఎథిక్స్ కమిటీ సమావేశం లో మా వాదన బలంగా వినిపించామన్నారు .పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల పై వివాదం జరిగిన రోజు 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో అసెంబ్లీ లో మాట్లాడించారు .అది మూడ్ అఫ్ ది హౌజ్ ఎలా అవుతుంది అని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ సభ్యుల మాటల ఆధారం గా పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఎజెండా గా చేర్చారు . కౌశిక్ రెడ్డికి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వాలి అనీ చైర్మెన్ ను కోరామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ ,దానం నాగేందర్ ,వీర్లపల్లీ శంకర్ ,మందుల సామేల్ సభ లో అనుచితంగా మాట్లాడటం ,ప్రవర్తించడం పై ఎథిక్స్ కమిటీ కి రాత పూర్వకంగా పిర్యాదు ఇచ్చాము .ఇందుకు వారు మాట్లాడిన వీడియోలు ఆధారంగా సమర్పించామని తెలిపారు. మా విజ్ఞప్తి పై నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు . ఈ రోజు మీటింగ్ లో చూపిన వీడియో లను బట్టి మిగతా పార్టీల సభ్యులు మాట్లాడారు .బీజేపీ బీ ఆర్ ఎస్ లు సహకరించుకుంటున్నాయన్న ఎథిక్స్ కమిటీ కాంగ్రెస్ సభ్యుడి ఆరోపణలో నిజం లేదు అన్నారు. కౌన్సిల్ చైర్మన్ గుత్తా గత ప్రభుత్వ అన్ని పథకాలు కొనసాగుతున్నాయనడం లో నిజం లేదు ,రైతు బీమాకు ప్రీమియం కట్టక ఆపేశారు. కొండసురేఖ వ్యవహారం పై ఏం జరుగుతుందో తెలియదు , రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అన్నారు . మేము ఇన్ని నెలలుగా ఎత్తి చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదాలను ఇపుడు ఆ పార్టీ నేతలే ప్రస్తావిస్తున్నారు .కాంగ్రెస్ లో నాయకుల తీరు ఎవరికి వారే యమున తీరే అన్నట్టు ఉంది అని ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# నేడు బాన్సువాడలో కరెంట్ కట్

బాన్సువాడ బతుకమ్మ : విద్యుత్ లైన్లలో మరమ్మతులు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా బాన్సువాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. తాడుకోల్ రోడ్డు, వాసవి కాలనీ, కోట గల్లి, బీడీ కాలనీ,ఆర్వత్ కాలనీ, ఫిరోస్ కాలనీ, బాలాజీ నగర్, కొయ్యగుట్ట రోడ్డు ప్రాంతాలతో పాటు సంగమేశ్వర కాలనీలోని 3వ, 4వ రోడ్లలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త పోల్స్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు






## మేయర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నగర మేయర్ కూరగాయల ఉమారాణి తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం కసాబ్ గల్లీ లో గల స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ తో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనో ధైర్యాన్ని ఇచ్చారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులు



మామిడిపల్లి, బతుకమ్మ : మండలంలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కూన లతా సాగర్ సోమవారం అభినందించారు. జిల్లా స్థాయి శిక్షణ శిబిర ఎంపికల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎన్. సాత్విక, డీ. నిత్యశ్రీ, ఆర్. విశాల్, కే. లక్షిత్‌లను పాఠశాల సిబ్బందితో కలిసి సత్కరించారు. శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు కూన లక్షిత్ నందిగామ, సాత్వికరాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ కూన లతా సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మాక్లూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కైరంకొండ బాబు మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు వి. భారతి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేయడం, కష్టపడి శ్రమించడం వల్లే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాబోయే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వీ. భారతిని కూడా సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరిగొప్పుల చిరంజీవి, కూన సాగర్, భోజేందర్, లింగన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు బాన్సువాడలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం.



బాన్సువాడ బతుకమ్మ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 రోజుల కార్యాచరణపై చర్చించేందుకు ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబ్బేర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్‌లో ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.ఈ సమావేశానికి బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జి విజీ గౌడ్, బాన్సువాడ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి తోట ఆగన్న తదితరులు పాల్గొంటారనీ తెలిపారు.నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సమన్వయ కమిటీ సభ్యులు, బూత్ లెవల్ ఏజెంట్లు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని షేక్ జుబ్బేర్ కోరారు.

## ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు

ఇందిరాగాంధీ విగ్రహం వెనుకకు

తరలింపు పనులను పరిశీలించిన కాసుల బాలరాజ్.



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం చూపే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. చౌరస్తా వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహాన్ని కొంత వెనుకకు తరలించి, వాహనాల రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ పనులను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విగ్రహాన్ని వెనుకకు జరిపే పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. విగ్రహం తరలింపు అనంతరం చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యం కోసం అవసరమైన చర్యలను నిరంతరం చేపడతామని కాసుల బాలరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్ గోవు గంగాధర్, అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

సర్ నోటీసులపై అధికారులతో ఆరా

అర్హులైన ఒక్కరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా చూడాలి



బాన్సువాడ, బతుకమ్మ : తన స్వగ్రామమైన పోచారంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి హాజరై తన చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత పెరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలని ఆకాంక్షించారు. అనంతరం సర్ నోటీసులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి అర్హత ఉన్న ఒక్కరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎవరి ఓటు హక్కు తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, బాన్సువాడ గ్రామీణ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకున్న వారికి బెయిల్

ఎల్లారెడ్డి, బతుకమ్మ:ఎల్లారెడ్డి నియోజకవర్గం లోని మల్కాపూర్ లో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పైన దాడి పై గన్ మెన్ ఫిర్యాదుతో 13 మంది మల్కాపూర్ గ్రామస్థులను అరెస్ట్ చేసిన కేసులో వారికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేంధర్ తెలిపారు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలో మల్కాపూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు గ్రామంలో పర్యటన సందర్భంగా గ్రామస్థులు దాడిచేసి గాయపర్చినరని,ఈ విషయం 13 మందిని రిమాండ్ చేసి మరికొంత మంది కోసం పోలిసులు గాలిస్తున్నరని తెలిపారు. 5 రోజులు గడిచిన తర్వాత ఎఫ్ఐఆర్ ఎలా నమోదుచేస్తారని, ఈ కేసులో ఎలాంటి వాస్తవాలు లేవని 13 మందికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే తెలిపారు

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

హైదరాబాద్, బతుకమ్మ:: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా నిర్వహించిన విస్తృత స్థాయి సంప్రదింపుల వివరాలను కమిటీ ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సంప్రదింపుల్లో 13 వేల మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులతో పాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు పాల్గొన్నట్లు కమిటీ తెలిపింది. ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తులతో పాటు ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరత్తును ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పన వంటి అంశాల్లో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సమావేశంలో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, ఐఏఎస్, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఐఏఎస్, వి.పి. గౌతమ్, ఐఏఎస్, ఎస్. శ్రీధర్, ఐఏఎస్, ముఖ్యమంత్రి ఓఎస్డీలు,



ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు తదితర అంశాలను కమిటీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెం. 679 ద్వారా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించినందుకు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్‌రెడ్డి, ఎస్. రాములు నాయక్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

బిక్కనూర్, బతుకమ్మ:రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శనివారం బిక్కనూర్ మండలం రామేశ్వరం పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్యాక్స్ చైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి భాధ్యతలు స్వీకరించారు. ఈ సంధర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ...యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు కాగా దానిని భిక్కనూర్‌లో ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా ఉన్న రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యం. రైతులకు అవసరమైన పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలి అని సూచించారు. సొసైటిలు కేవలం రుణాలు ఇచ్చే సంస్థలుగా కాకుండా రైతుల సమస్యలకు పరిష్కారం చూపే కేంద్రాలుగా మారాలని అన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు నేరుగా సేవలు అందించడంలో నూతన పాలకవర్గాలు





బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, గ్రామీణ మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. కొంత ఆలస్యం కావచ్చు కానీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుంది అని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారంలోకి తీసుకెళ్లారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, ఇరేని సందీప్ సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కౌలాస్ నాలా ప్రాజెక్టులో ఇన్ ఫ్లో 498 క్యూసెక్కుల వరద



జుక్కల్, బతుకమ్మ :తెలంగాణ సరిహద్దులోని కౌలాస్ నాలా ప్రాజెక్టులో ఇన్ ఫ్లో 498 క్యూసెక్కుల వరద వస్తుందని ప్రాజెక్ట్ ఎఇ శివకుమార్ తెలిపారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 458.00 మీటర్లు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టులో 457.85 మీటర్లకు చేరుకుందని తెలిపారు. కౌలాస్ నాలా ప్రాజెక్టులో 498 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈ శివకుమార్ తెలిపారు. ఒక గేటు విడుదల చేసి నీటిని పంట భూములకు ,వాగులకు రిజర్వేషన్ ఆయన అన్నారు. ఒక గేటు ద్వార 585 క్యూసెక్కుల నీటిని విడుధల చేస్తున్నమని ఆయన అన్నారు. కెనాల్ ద్వారా 80 క్యూసెక్కుల నీటిని పంట భూములకు విడుదల చేశామని ఆయన పేర్కొన్నారు. ఇన్ ఫ్లో వస్తుందని ప్రాజెక్టు ఏఈ పేర్కొన్నారు.

### స్టార్ వరల్డ్ హై స్కూల్ విద్యార్థులకు

## హాకీలో ద్వితీయ బహుమతి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జిల్లా స్థాయి హాకీ క్రీడా పోటీలలో స్టార్ వరల్డ్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు కరస్పాండెంట్ ధర్మరాజు తెలిపారు. హాకీ క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అజాన్, ఆరుష్ జాదవ్, రఘువీర్, ప్రిన్స్, కైఫ్, అక్షయ్, సుశాంత్ లను కరస్పాండెంట్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, హై స్కూల్ ప్రిన్సిపల్ హరి శంకర్, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రైతులు అంతర పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలి

జుక్కల్. బతుకమ్మ:వ్యవసాయశాఖ అందించే సలహాలు, సూచనలు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి వి.రాజు అన్నారు. శనివారం జుక్కల్ మండలంలోని గుండూర్ గ్రామ శివారులో సాగు చేస్తున్న పత్తి, సోయాబీన్ తదితర పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలను ఆశించే చీడపీడలను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన పిచికారీ మందుల వినియోగం, వాటి మోతాదు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో పంటల సాగును పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని డీసీఎస్ వాలంటీర్లను ఆదేశించారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయడంతో పాటు పంటల ఫొటోలను తీసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు.రైతులకు పంటల సాగు, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని వి.రాజు సూచించారు. వ్యవసాయశాఖ అందించే సాంకేతిక సలహాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధాపురే



కాశీనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు డి.పండరి, జి.శ్రీలేఖ, మల్లికార్జున్, అనిల్, గజానంద్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలి

## మంత్రి సీతక్కను కోరిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

ఎల్లారెడ్డి, బతుకమ్మ : ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కని కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి ప్రతిపాదనలను సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ భవనాలు, రహదారులు, వంతెనలు, సీడీ వర్క్స్, స్పోర్ట్స్ స్టేడియం, గోడౌన్‌లకు రోడ్డు కనెక్టివిటీతో పాటు నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల్లో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. గాంధారి మండలం సంగెం రేవు వద్ద గాంధారి లింగంపేట జడ్పీ రోడ్డుపై హెచ్‌ఎల్ బీ వంతెనరూ.4.90 కోట్లు, రామారెడ్డి మండలం గిద్దకు వెళ్లే పీడబ్ల్యూడీ రోడ్డుపై సీడీ వర్క్ రూ.1 కోటి, లింగంపేట మండలం కన్నాపూర్‌కు వెళ్లే పీడబ్ల్యూడీ రోడ్డుపై సీడీ వర్క్ రూ. కోటి, లింగంపేట మండలం మోతే నుంచి రామలక్ష్మణపల్లి మీదుగా మోతే తండా వరకు బీటీ రోడ్డు రూ.4 కోట్లు, గాంధారి చాడ్మల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి సోమారం మీదుగా గుజ్జులొంక తండా దుర్గం కొత్తబాది వరకు వంతెన నిర్మాణం రూ.1.50 కోట్లు, రాజంపేట



మండలం పాలుగడ్డ తండాకు వెళ్లే ఆర్‌అండ్ బి రోడ్డుపై హెచ్ ఎల్ బీ నిర్మాణం రూ.1.20 కోట్లు, రాజంపేట మండలం శాలిప్ప తండాకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపై బీటీ రోడ్డు రూ.80 కోట్లు, తాడ్వాయి మండలంలో కామారెడ్డి ఎల్లారెడ్డి రోడ్డు నుంచి ఐటిఐ కళాశాల వరకు బీటీ రోడ్డు రూ.1.20 కోట్లు, గాంధారి మండలంలో జువ్వాడి జడ్పీ రోడ్డు నుంచి గాంధారి స్పోర్ట్స్ స్టేడియం వరకు 1.3 కి.మీ బీటీ రోడ్డు రూ.1.50 కోట్లు, రాజంపేట మండలం అర్గొండలో గుండారం మెదక్ ఆర్ అండ్ బి రోడ్డు నుంచి టీఈడబ్ల్యూసీ గోడౌన్ సైట్ వరకు 2.2 కి.మీ బీటీ రోడు రూ.2.50 కోట్లు,ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అవసరమైన ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు, నాగిరెడ్డిపేట్ మండలంలో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనం నిర్మాణం, ఎల్లారెడ్డి మండలంలో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనం నిర్మాణాలు అన్ని అభివృద్ధి ప్రతిపాదనలకు కలిపి సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ మంత్రి సీతక్కని కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి ప్రతిపాదనలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలను పరిశీలించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం అందించడం, ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించడం, మహిళా శిశు సంక్షేమ సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలిపారు. మంత్రి సీతక్క సానుకూల స్పందనతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం రానుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# హమాలీలకు సమగ్ర చట్టం . . . సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## తెలంగాణ హమాలీమిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : తెలంగాణ హమాలీ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ?మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని ఐఎఫ్ టియు నగర కార్యాలయంలో ద్వారక నగర్ లో హమాలీ జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు రోజురోజుకు ఉపాధి కోల్పోతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హమాలీ కార్మికుల జీవనాధారం పూర్తిగా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం వల్ల గతంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు కొనసాగే సీజనల్ ఉపాధి ప్రస్తుతం నెల రోజులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, గోదాములు, మార్కెట్ యార్డుల్లో స్థానిక హమాలీ కార్మికులకు పని కల్పించాల్సిన చోట గోదాం లేబర్ కాంట్రాక్టర్లు తమ లాభాపేక్షతో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వలస కార్మికులను అధిక సంఖ్యలో నియమిస్తూ, స్థానిక కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల శ్రమదోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు, గోదాములను ఏర్పాటు చేయాలని మరియు పరిశ్రమల్లో స్థానిక హమాలీ కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర హమాలీ కార్మికుల చట్టం తీసుకురావడంతో పాటు ప్రత్యేక హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి హమాలీ కార్మికుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డు జారీ చేసి, ఆ కార్డు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు 10 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రతి హమాలీ కార్మికుడికి ప్రత్యేక గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పరిశ్రమలు, ప్రభుత్వ గోదాముల్లో పనిచేసే కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు బి భూమన్న సదస్సుని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సుకు హమాలి యూనియన్ అధ్యక్షులు డి మల్లికార్జున్ అధ్యక్షత వహించారు.



వెజిటేబుల్ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మోహన్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా గారు వెజిటేబుల్ నైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు, కోల్డ్ స్టోర్స్ హమాలీ యూనియన్ అధ్యక్షులు గంగాధర్, లక్ష్మణ్, పసుపు డోల్ హమాలి వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు పండరి, సీడ్ కంపెనీ హమాలీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుశాంత్, పసుపు డోల్ కార్మికులు లలిత, ?ముల్లె హమాలి యూనియన్ నాయకులు. మల్లేష్, పీరయ్య, రాములు, అంజి, రిక్షా పుల్లర్ హమాలి, వర్కర్స్ యూనియన్. అధ్యక్షులు రైస్ ప్రధాన కార్యదర్శి వకీల్, యూనియన్ నాయకులు అన్వర్ ముజామిల్ దాదు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ డైట్ కళాశాలలో అష్టావధాన కార్యక్రమం



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ డైట్ కళాశాలలో భానోత్ నితిన్ చే అష్టావధాన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ తిరుక్కోవల్లూరు శ్రీనివాస్ సభా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ గణపతి అశోక శర్మ విచ్చేశారు. గౌరవ అతిథులుగా తల్లావఝుల మహేష్ బాబు చిత్రకళ శ్రీనివాస్ లు వచ్చారు. ప్రాశ్నికులుగా డాక్టర్ గంట్యాల ప్రసాద్ నిషిద్ధాక్షరి, కోకిల నాగరాజు అప్రస్తుత ప్రసంగం ఇతర ప్రాశ్నికులుగా డైట్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాశ్నికులు అడిగిన ప్రశ్నలు, అంశాలకు చక చకా పద్యాలను చెప్పి సభికులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేశాడు అవధాని నితిన్. విద్యార్థిగా ఉంటూనే అవధానంలో రాణించడం ఎంతో గొప్ప విషయమని ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రశంసించారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ గణపతి అశోక శర్మ తన ప్రశిష్యులు అవధానంలో రాణించడం తనకెంతో ఆనందంగా ఉందని కొనియాడారు. నితిన్ ప్రతిభను తల్లావజఝుల మహేష్ బాబు మెచ్చుకున్నారు. కోకిల నాగరాజు అప్రస్తుత ప్రసంగంలో వేసిన ప్రశ్నలకు సభికులు ప్రేక్షకులు ఎంతో ఆనందాన్ని పొందారు. ప్రాశ్నికులు అడిగిన ప్రశ్నలకు అవలీలగా పద్యాల రూపంలో సమాధానం ఇచ్చిన అవధాని భానోత్ నితిన్ ని అక్కడున్న ప్రతి ఒక్కరు అభినందనలతో కూడిన చప్పట్ల వర్షం కురిపించారు "మాతృభాషా దినోత్సవాన్ని" పురస్కరించుకొని మాతృభాష పరిరక్షణ ఈ కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని సభికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతాంశాలకు సంబంధించిన మట్టిగణపతులతో పర్యావరణ పరిరక్షణ, ఆదర్శ ఉపాధ్యాయులు, వానలు రావాలి, తెలుగు భాషా పరిరక్షణ వంటి అంశాలపై ప్రాశ్నికులు అడగగా అవధాని ఆశువుగా పద్యాలు చెప్పి ఆనందిం పజేశాడు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల లెక్చరర్లు సంజీవరావు, డాక్టర్ అన్నం దాస్ జ్యోతి, అరవింద్, ప్రతిభ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బ స్కూల్ లో ఆయుర్వేద వైద్య శిబిరం

## విద్యార్థులకు యోగపై అవగాహన



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ: ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నిజామాబాదు ఆధ్వర్యంలో దుబ్బ హైస్కూల్ లో విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం పాఠశాల అవరణలో జిల్లా ఆయుష్ ఇంచార్జి డాక్టర్ జె. గంగా దాస్ మాట్లాడుతూ వర్షాకాలం లో వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు , దిన చర్య, రుతు చర్య, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషధములు పంపిణీ చేశారు. యోగ వైద్యులు డాక్టర్ తిరుపతి విద్యార్థిని విద్యార్థులకు యోగ ప్రాముఖ్యత లు ప్రాణాయామం, ధ్యానంల గురించి వివరించారు. ఈ శిబిరంలో హెడ్ మాస్టర్ టి శ్రీనివాస్ ,ఆయుష్ ఫార్మాసిస్ట్ పురుషోత్తం, , ఆయుష్ సిబ్బంది, రమేష్ బిక్షపతి ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు



# తెలంగాణ యూనివర్సిటీలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంబాబు, క్రీడల డైరెక్టర్ డా. జి. బాలకిషన్, వైస్ ప్రిన్సిపాల్ డా.సి హెచ్. లక్ష్మణ చక్రవర్తి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,?విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొదట ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో విద్యతో పాటు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడల డైరెక్టర్ డా. జి. బాలకిషన్ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను



గుర్తించి ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుంది అనే భావనను విద్యార్థులు ఆచరణలో పెట్టాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

## తెలంగాణ ఉద్యమకారుడు ఈర్లశేఖర్‌కు పరామర్శ

### రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు అందించిన ఉద్యమకారులు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఈర్ల శేఖర్ అనారోగ్యంతో ఇంటికే పరిమితమై తీవ్ర ఆర్థికపరిస్థితులు ఎదుర్కోవడంతో తెలంగాణ ఉద్యమకారులు ఆదే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా బియ్యము, నిత్యవసర వస్తువులు ఇచ్చి మనోధైర్యం కల్పించారు. పోచమ్మగల్లీలోని ముదిరాజ్ వీధిలో ఈర్ల శేఖర్ నివాసానికి తెలంగాణ ఉద్యమకారులు కోనేరు సాయికుమార్, కరిపే రాజు, తుమ్మ నాగభూషణం, పాశుగంటి మహేష్, స్వర్గం రమేష్ తదితరులతో ఆదే ప్రవీణ్ కుమార్ కల్సి దాదాపు సంవత్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారులు ఈర్ల శేఖర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఎందరో మంది లో ఈర్ల శేఖర్ మొదటి స్థానంలో ఉన్నారని, ఈరోజు ఆయన ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకొని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నార యేండ్లకు పైగా అధికారంలో ఉన్న టీఆర్ ఎస్ పార్టీ నిజామాబాద్ అర్బన్ లో పేద ప్రజలకూ ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వలేదనీ, ఒక్క ఉద్యమకారుడికీ కూడా న్యాయం జరగపోవడం వల్ల తానిప్పుడు ఇరుకు రూములో జీవనం గడుపుతున్నారని ఆయనకు ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలని, బస్సు ఫ్రీ లాంటి సౌకర్యాలు కల్పించాలని, వారి చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులలో చూయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మేనిపెస్టో పెట్టిన విధంగా ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల జాగా ఇవ్వాలనీ ముఖ్యమంత్రిని కోరారు. చాలా ఘోరమైన పరిస్థితులలో ఉద్యమకారులు ఉన్నారని ఈ దయనీయ స్థితి నుంచి ఉద్యమకారులను ఆదుకునే ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరోజు ఉద్యమంలో పోలీసుల లాఠీ దెబ్బలను, వాటర్ కాన్వాయ్ లను ధైర్యంగా ఎదుర్కొని నిలిచినటువంటి ఈర్ల శేఖర్ లాంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం పై ఉందన్నారు.

## హియరింగ్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

### కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా హియరింగ్ నోటీసుల పంపిణీనీ వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు ఈ.ఆర్.ఓ లు, సహాయ ఈ.ఆర్.ఓ లు బూత్ లెవెల్ అధికారులకు దిశా నిర్దేశం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకెళుతున్నామని తెలిపారు. జిల్లాలో హియరింగ్ కోసం 4,32,401 నోటీసులు సిద్ధం చేశామని, 56,678 మందికి ఇప్పటికే నోటీసులు అందజేశామని అన్నారు. ఈ.ఆర్.ఓలు, సహాయ ఈ.ఆర్.ఓలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. వీ.సీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు సూచనలు చేశారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందించి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ల వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని, పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



దోమకొండ, బతుకమ్మ :రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద వారికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా దోమకొండ రెడ్డిసంఘం ఫంక్షన్ హాల్లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ లు ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు సులభంగా అందడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హత పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐరేని నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, మండల అధ్యక్షులు ఆశబోయిన శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, మాజీ జడ్పీటీసీ తిరుమల్ గౌడ్, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌పై విద్యార్థుల సమరశంఖం.. బాన్సువాడలో అవగాహన రోడ్‌షో.

### వాసవి హైస్కూల్ విద్యార్థుల అవగాహన రోడ్ షో.



బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాసవి హైస్కూల్, బాన్సువాడ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. “ఞఖఎ చీశ్ శ్రాశ్రీఖర్అఎ -- ఞఖజవ ాబతీ ఎముఖశ్రీప్త్ర ఖఅస ఞఖజవ ాబతీ జుఖతీప్త్ర” అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మీ శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్‌షో నిర్వహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని తీవ్రంగా కలుషితం చేయడంతో పాటు మానవ ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని విద్యార్థులు వివరించారు. ప్లాస్టిక్ వల్ల నేల, నీరు కలుషితం కావడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అవగాహన కల్పించారు.రోడ్‌షోలో విద్యార్థులు పలు నినాదాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. “ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం”, “ప్లాస్టిక్‌కు నో చెప్పండి.. ఆరోగ్యాన్ని కాపాడండి”, “పచ్చని భవిష్యత్తు కోసం ప్లాస్టిక్‌ను దూరం చేద్దాం” అంటూ నినాదాలతో పాటు ఉపన్యాసాలు, నృత్య రూపకాల ద్వారా ప్లాస్టిక్ వినియోగంపై చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మీ శ్వేత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వం లేదా అధికారుల ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రస్తుతం మనం తీసుకునే చిన్నచిన్న నిర్ణయాలే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు, పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని విద్యార్థులు ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా “ప్లాస్టిక్ రహిత సమాజం -- ఆరోగ్యకరమైన జీవితం -- సురక్షితమైన భూమి” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. విద్యార్థులు నిర్వహించిన అవగాహన రోడ్‌షో స్థానికులను ఆకట్టుకుంది.

## ఎన్‌హెచ్-44 బిక్కనూర్ చర్చ్,బేసిక్ వద్ద

## ఫ్లైఓవర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షట్కర్

### భిక్కనూర్ చర్చ్, దోమకొండ-బీబీపేట్ వాసుల చిరకాల కోరికకు మోక్షం - సర్వేకు ఎన్‌హెచ్‌ఏఐ హామీ





భిక్కనూరు,బతుకమ్మ :కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం చర్చ్,దోమకొండ, బీబీపేట్ మండలాల ప్రజల చిరకాల కోరిక అయిన ఎన్‌హెచ్-44 ఫ్లైఓవర్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. భిక్కనూరు చర్చ్, బేసిక్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు చేసిన విజ్ఞప్తికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సానుకూలంగాస్పందించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ శనివారం ఎన్‌హెచ్-44లోని చర్చ్,బేసిక్ ప్రాంతాన్ని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్-44 దాటేందుకు దోమకొండ, బీబీపేట్ తో పాటు పరిసర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు.ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇక్కడ ఫ్లైఓవర్ అవసరమని కోరగా, సానుకూలంగా స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు త్వరలోనే సర్వే నిర్వహించి, సాంకేతిక అంశాలు పరిశీలించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే రాకపోకలు సులభతరం కావడంతో పాటు రహదారి ప్రమాదాలు తగ్గుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, గ్రంథాల సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,భిక్కనూరు సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్నారి జైనబ్ ఫాతిమా కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పోచారం

### తాడ్కోల్ చౌరస్తాలో ఆక్రమణల తొలగింపు.. ప్రమాదాల నివారణకు చర్యలు

బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డు చౌరస్తా వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాలుగేళ్ల చిన్నారి జైనబ్ ఫాతిమా కుటుంబ సభ్యులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం పరామర్శించారు. చిన్నారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చిన్నారి జైనబ్ ఫాతిమా మృతి అత్యంత బాధాకరమైన సంఘటన అని అన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తాడ్కోల్ చౌరస్తా వద్ద భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చౌరస్తా పరిసరాలను ఇరుకుగా చేస్తున్న ఆక్రమణలను తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
చిన్నారి జైనబ్ ఫాతిమా కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుని, కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని పోచారం శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.